నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ అఫ్జల్ బాబా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేట్లబురుజు ఫీడర్ పరిధి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, శివాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, బండ్లగూడ, దూద్‌బౌలి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

ఫలక్‌నుమా సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. జూపార్క్, బాలాపూర్, బార్కాస్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బీఎన్‌కే కాలనీ, జమాల్ బండ తదితర ప్రాంతాల్లోనూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, తీగలకుంట, సలాల తదితర పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అఫ్జల్‌గంజ్: 11 కె.వి సీతారామ్‌బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గుఫా మందిర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కె.వి దూల్‌పేట్ ఓవర్ హెడ్, ఆర్కేపేట్ ఫీడర్ పరిధిలోని మంగళ్‌హాట్, అమర్‌నగర్ కాలనీ, మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్, అజారి హోటల్, బిలాల్ మజీద్, గంగాబౌలీ, బంగ్లాదేశ్ గల్లీ తదితర ప్రాంతాల్లోనూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11 కె.వి గ్యాన్‌బాగ్ ఫీడర్ పరిధిలోని గ్యాన్‌బాగ్ కాలనీ, నయాబస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

లడ్డూ ప్రసాదం పంపిణీ



లడ్డూలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

డబీర్‌పురా: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా డబీర్‌పురా కోమటివాడిలోని శ్రీరామ మందిరంలో కల్యాణ మహోత్సవం, పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు బుధవారం ఆలయ ప్రాంతంలోని ఇంటింటికీ తిరుగుతూ తలంబ్రాలు, అక్షింతలు, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. దాదాపు 1600 లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారు.

నామినేటెడ్ పదవి కేటాయించండి

గన్‌ఫౌండ్రీ: ప్రజాయుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెలకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని గాంధీపదం చారిటీ సర్వీసెస్ అధ్యక్షుడు సీహెచ్ గిరీశం కోరారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల ప్రయోజనాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసినటువంటి గద్దర్ కుటుంబానికి సముచిత ప్రాధాన్యతను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన

యాకుత్‌పురా: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ మొహీనుద్దీన్ తెలిపారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో దారుషిఫా చౌరస్తా, సాలార్‌జంగ్ మ్యూజియం రోటరీ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వాహనదారులు, ఆటోడ్రైవర్లకు శబ్ద కాలుష్యంపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటమిని జీర్ణించుకోలేకే అసత్య ప్రచారం'



డాక్టర్ మల్లు రవిని సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ మల్లు రవిని బుధవారం ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల పాటు ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఉద్ధరించింది.. ఏమీ లేదని రూ.6 లక్షల కోట్లు అప్పులు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిందితుల రిమాండ్

బహదూర్‌పురా: రౌడీషీటర్‌ను చంపేందుకు పథకం వేసిన ముగ్గురు నిందితులను కాలాపత్తర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి తపంచ (తుపాకీ), 3 బుల్లెట్లు, రెండు కత్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్ బిర్యానీ షా టెకిడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అసద్ (30) రౌడీషీటర్‌గా ఉంటూ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. దీంతో పోలీసులు అసద్ కార్యకలాపాలపై నిఘా పెట్టడంతో తన మకాంను నిజామాబాద్‌కు మార్చాడు. అక్కడ కూడా పలు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లి తిరిగి వచ్చాడు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చిన అసద్ కాలాపత్తర్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్ అలియాస్ ఆషు (22), నిజామాబాద్ బాన్సువాడ రాజారాం దుబ్బాకకు చెందిన బావూరి అనార్కలీ (40), బావూరి జుల్ఫీ సింగ్ అలియాస్ సూరజ్ సింగ్ అలియాస్ శంకర్ సింగ్ అలియాస్ దౌలత్ సింగ్‌తో కలిసి కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ మహ్మద్ అష్ఫాక్‌ను అంతమొందించేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా కత్తులు, తుపాకీ వాటిని కొనుగోలు చేశారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాలాపత్తర్ పోలీసులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించి మహ్మద్ అసద్, మహ్మద్ హుస్సేన్, బావూరి అనార్కలీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి తపంచ (తుపాకీ), 3 బుల్లెట్లు, రెండు కత్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం కాలాపత్తర్ పోలీసులకు అప్పగించారు. కాగా ఈ కేసులో మరో నిందితుడు బావూరి జుల్ఫీ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోండి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులంతా మార్చి నెల 31 లోపు లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోవాలని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. మార్చి 31తో లైసెన్సుల రెన్యూవల్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో వ్యాపారులంతా తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే వ్యాపారులందరికీ నోటీసులు జారీ చేశామని, ఒకవేళ లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోకపోతే రోజుకు రూ. 500 ఫైన్ కట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

అఫ్జల్‌గంజ్: మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేగంబజార్‌లోని సావిత్రీకన్యా పాఠశాల విద్యార్థినులు చేపట్టిన అవగాహన ర్యాలీని బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్ ప్రారంభించి ప్రసంగించారు. బాలల సంరక్షణకు ప్రభుత్వంతో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్గదర్శిని వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి ప్రధానోపాధ్యాయురాలు సీతాలత, లహరి, పద్మావతి, ప్రవళిక, రాణి, మమత, శైలజ, భార్గవి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ఈ–టెక్నో పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ–టెక్నో పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్తలు జీఎం.గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదటి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ప్రమాణ స్వీకరం చేసిన రోజును పురస్కరించుకుని యేటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విరించి ఆసుపత్రి ప్రముఖ గైనకాలజిస్ట్ శ్రీదేవి గుట్ట విద్యార్థినులకు హెల్త్ అవెర్నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న టి.వైష్ణవి నేషనల్ సబ్ జూనియర్ రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్, ఇంటర్నేషనల్ సబ్ జూనియర్ రెజ్లింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించినందుకుగాను ఆమెకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ నాషీర్‌ఖాతూన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయురాలు



విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

కుటుంబంలో అమ్మాయిలది కీలక పాత్ర

గోల్కొండ: కుటుంబంలో అమ్మాయిల పాత్ర కీలకమని గోల్కొండ ఉర్దూ హైస్కూల్ అకాడమిక్ హెడ్ సమీనాతన్వీర్ అన్నారు. పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు సరైనా ప్రోత్సాహం ఉంటే వారు అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' నినాదంతో బాలికల పోషణ, చదువులో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జాస్మీన్‌బేగం, సరన్నుమ్ బేగం, సహనీయత్ ఉన్నీసా, నాగలక్ష్మి, షబానా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శంకర్ యాదవ్, అరుణజ్యోతి

దమయంతి తివారీకి ఘన నివాళి



దమయంతి తివారీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్, సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ తల్లి దమయంతి తివారీ శ్రద్ధాంజలి కార్యక్రమం సుల్తాన్‌షాహీలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ పి. సాయిచైతన్య, ఛత్రినాక ఏసీపీ రమేశ్, మాజీ డీసీపీ ఎం.వెంకటేశ్వర్‌రావు, ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, టీపీసీసీ మాజీ కార్యదర్శి, కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు, ఆదర్ల మహేశ్, ఆనంద్‌గుప్తా, లేనిన్ బాబు, డాక్టర్ ధైర్యవాన్‌తో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు, ఆలయాల కమిటీ ప్రతినిధులు సుల్తాన్‌షాహీలోని ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

యువ క్రీడాకారులకు సన్మానం



జాతీయ పోటీలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీలోని తన కార్యాలయంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియోద్దీన్ ఈ నెలలో చెన్నైలో జరగనున్న చలో ఇండియా పోటీలకు ఎంపికైన యువ క్రీడాకారులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో త్వరలోనే పాఠశాల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తానని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అన్ని హంగులతో కూడిన క్రీడా స్టేడియం నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కార్వాన్‌కు చెందిన మహ్మద్ షోహెబ్ 55 కిలోల విభాగంలో, జె.కార్తీక్‌రాజ్ 80 కేజీల విభాగంలో, కె.గజానంద్‌సింగ్ 92 కేజీల విభాగంలో ఎంపికయ్యారని, వారు చెన్నైలో పతకాలతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఖలీపహల్వాన్, ఫారూఖ్ ఉన్నారు.

డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లో సెల్ఫీ పాయింట్ ప్రారంభం



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని బుద్ధ సర్కిల్ వద్ద ప్రసిద్ధ ప్రదేశాల్లో ''సెల్ఫీ–పాయింట్'' ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో రక్షణ మంత్రిత్వ శాఖ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ ఉమ్మలనేని రాజాబాబు బుధవారం పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ.. సెల్ఫీ పాయింట్ కమ్యూనిటీ హాల్, ఆడిటోరియం, షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నివాసితులు, వారి కుటుంబాలకు మాత్రమే కాకుండా డీఆర్‌డీఓ టౌన్‌షిప్ సందర్శకులకు కూడా కొత్త ఉత్సాహాన్ని తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీఆర్‌డీవో ప్రతిభ ఉట్టిపడేలా రూపొందించిన ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశిష్ట శాస్త్రవేత్త, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఎ.శ్రీనివాస మూర్తి సూచించారు. అనంతరం ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ చీఫ్ ఇంజనీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మోహీనుద్దీన్ మాట్లాడుతూ... సెల్ఫీ పాయింట్ రూపకల్పనలో వివిధ అంశాలను పరిగణలోకి తీసుకున్నామని, అందులో భాగంగా త్రివర్ణ పతాకం, భారతీయ వారసత్వ శిల్పాలు, స్మారక చిహ్నాలు, భారత ప్రభుత్వం నిర్దేశించిన స్వచ్ఛభారత్ స్వస్థ భారత్, యోగా లాంటి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సెల్ఫీ–పాయింట్‌కి ఇరువైపులా క్షిపణి నమూనాలు, భంగిమ, ఒక వ్యక్తి సెల్ఫీ తీసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీసీఈ (ఆర్డీ) ఎస్టేట్స్ సౌత్ డాక్టర్ అనిల్ ఖురానా, కమోడోర్ ఎం.ఎల్.నారాయణ, వైస్ చైర్మన్, ఎస్టేట్ మేనేజ్‌మెంట్ అడ్వైజరీ కమిటీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం డివిజన్‌లోని బాలదానమ్మబస్తీ గ్రౌండ్స్‌లో కేంద్ర పథకాల సింగిల్ విండో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముద్రలోన్, పీఎం ఉజ్వల్ యోజన, ఆధార్ మార్పులు, చేర్పులు, పీఎం ఆవాజ్ యోజన, పీఎం స్వయం నిధి యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, హెల్త్ చెకప్‌లు, ఆయుష్మాన్ భారత్ యోజన, టీబీ అవేర్నెస్ కల్పించి.. వాటికి సంబంధించిన కౌంటర్ ఏర్పాటు చేశారు. అనంతరం వికసిత్ భారత్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో యూడీసీ అధికారి యుగేంధర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజున్నీసా, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సౌమ్య, ఇన్‌చార్జి శ్రీనివాస్, ఆధార్ ఇన్‌చార్జి నజీర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రూనీస్‌పై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

నాంపల్లి: ఉద్యానవర్సిటీ భూములను రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి ఇవ్వొద్దంటూ ఆందోళన చేపట్టిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రూనీస్‌ని పోలీసులు జుట్టుపట్టుకుని లాగడాన్ని జేఎన్‌ఎఫ్ఏయూ ఏబీవీపీ విద్యార్థి నేత బుస్సా భరత్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాసబ్‌ట్యాంక్‌లో మాట్లాడారు. దాడికి పాల్పడిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం'



పాండుయాదవ్‌ను సత్కరించిన మాణిక్ ప్రభు, ముక్క కృష్ణా గుప్తా, శశికాంత్ కులకర్ణి

అబిడ్స్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయమని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పేర్కొన్నారు. మరోసారి గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియామకమైన పాండుయాదవ్‌ను గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణగుప్తా, అధికార ప్రతినిధులు శశికాంత్ కులకర్ణితో పాటు పలువురు నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాండు యాదవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్, పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామన్నారు.

శరవేగంగా ఓటరు జాబితా సవరణ



నాంపల్లి: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన నాంపల్లి మున్సిపల్ అధికారులు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు మరింత మెరుగైన, సమగ్రమైన ఓటరు జాబితాను రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా సవరణను బుధవారం ప్రారంభించారు. కొత్త ఓటర్ల నమోదు పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు జరుగుతుంది. మార్పులు, చేర్పుల తుది జాబితాను రూపొందించిన అధికారులు, ఇప్పుడు సమగ్రమైన ఓటరు జాబితా రూపకల్పన చేయనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 277 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఒక్కో పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండాల్సిన ఓటరు పేరు మరో స్టేషన్‌లో వందలాదిగా ఉన్నాయి. వీటిని సరిచేసే పనిలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. మరికొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

అబిడ్స్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సోలార్ మ్యాన్ ఆఫ్ ఇండియా ప్రొఫెసర్ చేతన్‌సింగ్ సోలంకి పేర్కొన్నారు. డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో పర్యావరణంలో మార్పులపై బుధవారం జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్బన్‌ను అధికంగా వినియోగించడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, తగ్గించేందుకు ఇతర మార్గాలు చూడాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుజాత గాడే మాట్లాడుతూ.. తమ విద్యార్థులను విద్యతో పాటు అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చేతన్‌సింగ్ సోలంకిని ప్రిన్సిపాల్ సన్మానించి అభినందించారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైమండ్‌జూబ్లీ పాఠశాల దేశంలోని విద్యాలయాల్లో 8వ ర్యాంక్ సాధించి విద్యారంగంలో దూసుకుపోతుందన్నారు.



ప్రొఫెసర్ చేతన్ సింగ్ సొలంకిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గాడే

ఆకట్టుకుంటున్న మహనీయుల బొమ్మలు



సెల్ఫీ తీసుకుంటున్న యువకుడు

చార్మినార్: రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకొని మదీనాలోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారి ఆధ్వర్యంలో షో రూం వద్ద ఏర్పాటు చేసిన మహనీయులు వేషాధారణ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సరోజినీ నాయుడు, మహ్మద్ అలీ జోహార్ తదితరుల బొమ్మల వద్ద వాహనదారులు, పాదచారులు సెల్ఫీలు తీసుకుంటున్నారు. నేటి తరానికి నాటి మహనీయుల త్యాగాలు, వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసేందుకే యేటా రిపబ్లిక్ డే, పంద్రాగస్టు వేడులకు ఈ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నానని మార్ట్ డైరెక్టర్ తెలిపారు.

ఫిబ్రవరి 4న శ్రద్ధాంజలి కార్యక్రమం

సుల్తాన్‌బజార్: హనుమాన్ టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయ ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల అభిమానం సాధించిన ప్రొఫెసర్ ఎస్‌టి.వేదాచలం శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 4వ తేదీన ప్రగతి మహా విద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించాలని కళాశాల పూర్వ విద్యార్థుల నిర్ణయించారు. కళాశాలలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, కళాశాల పాలకవర్గం తరఫున రాజేశ్ షా, ఎంబీఏ ప్రోగ్రాం డైరెక్టర్ మోహన్ నాయుడు, పూర్వ విద్యార్థులు ప్రకాశ్ గుప్తా, బంగారు సుధీర్‌కుమార్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎం.విజయనిర్మల, మనీశ్ సమావేశమై సభ నిర్వహించాలని నిర్ణయించారు.

ఇద్దరికి జైలు శిక్ష

అబిడ్స్: ఎంజే మార్కెట్ కేర్ ఆసుపత్రి ప్రాంతంలోని సాయి టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి దాటినా కూడా మూసివేయకపోవడంతో సాయినాథ్‌పై అబిడ్స్ పోలీసులు ఈపిటీ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి సాయినాథ్‌కు ఐదురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా అబిడ్స్ ప్రాంతంలో అర్ధరాత్రి దాటినా పాన్‌షాప్ నిర్వహిస్తున్న ఎంఏ నయీంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టుకు తరలించగా రెండురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు మాట్లాడుతూ.. హోటళ్లు, దాబాలు, ఇతర వ్యాపార సంస్థలు నిబంధనలు పాటించాలని సూచించారు.

ఒకరి అదృశ్యం



ఖుర్షీద్

చాంద్రాయణగుట్ట: మార్కెట్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బార్కాస్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖుర్షీద్ (35) హఫీజ్‌బాబానగర్‌లో తన యజమాని వద్ద పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 20న బాట సింగారం మార్కెట్‌లో పండ్లు తీసుకొస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌గా ఉండడంతో అతని భార్య అస్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించి ఖబ్రస్తాన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. షబే బరాత్‌కు నేపథ్యంలో ఖబ్రస్తాన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారించేందుకు అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

బహదూర్‌పురా: అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడికి నాంపల్లిలోని మూడో మెట్రోపాలిటన్ సెషన్ మెజిస్ట్రేట్ జె.కవిత యావజ్జీవ కారాగార శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్ రామ్నాస్‌పురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్ ఖురేషి (31) కార్మికుడిగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ మోసిన్ అహ్మద్‌కు రూ.25 వేలు అప్పుగా ఇచ్చాడు. అయితే డబ్బులు చెల్లించకపోవడంతో అమీర్ ఖురేషి మహ్మద్ మోసిన్‌ను 2018 డిసెంబర్ 24న ఫోన్ చేసి పిలిపించి కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ కేసులో అప్పటి కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంరెడ్డి, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ దాలి నాయుడు సహకారంతో బుధవారం కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. దీంతో న్యాయమూర్తి కవిత పూర్వ పరాలను పరిశీలించి అమీర్ ఖురేషిని దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగారా శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.